సాక్షి విశాఖపట్నం

ఆదివారం । 20 । అక్టోబర్ । 2024



కొత్త సీసా.. పాత మందు..!

సీసా మాత్రమే మారింది. అందులో పాత లిక్కరే ఉంది. రూ.99కే క్వార్టర్ చీప్ లిక్కర్ ఊసే లేదు. 8లో



రేపు అమరవీరుల దినోత్సవం

పోలీసు అమరవీరుల దినోత్సవం నిర్వహించేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం సిద్ధమవుతోంది. 8లో



మెరుగైన వైద్యసేవలందించాలి

ఆసుపత్రుల్లో వైద్య సేవలు మరింత విస్తృతం చేయాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ వైద్యాధికారులను ఆదేశించారు. 8లో

న్యూస్‌రీల్

లడ్డూ విక్రయాలు పునఃప్రారంభం



లడ్డూలు విక్రయిస్తున్న ఆలయ సిబ్బంది

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం(టీటీడీ)లో శనివారం శ్రీవారి లడ్డూ విక్రయాలు పునఃప్రారంభమయ్యాయి. తిరుమలలో బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఇక్కడ లడ్డూ విక్రయాలు నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఇక నుంచి ప్రతి రోజూ లడ్డూ విక్రయాలు ఉంటాయని ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు తెలిపారు. కాగా.. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రీవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం రూ.19.08 లక్షలు



హుండీల ఆదాయం లెక్కిస్తున్న సభ్యులు

సీతమ్మధార: సంపత్ వినాయగర్ దేవస్థానం హుండీల ఆదాయం లెక్కింపు శనివారం జరిగింది. 30 రోజులకు గానూ రూ.19.08 లక్షల నగదు వచ్చింది. 132.1 గ్రాముల వెండి, 121 అమెరికన్ డాలర్లు, 5 సౌదీ రియాల్స్, 1 ఒమన్ రియాల్, 10 సింగపూర్ డాలర్లు, 10 యూఏఈ దిర్హమ్స్ వచ్చినట్లు ఈవో కె.శిరీష తెలిపారు. దేవస్థానం ఫౌండర్, ఫ్యామిలీ మెంబర్ టి.ఆర్.చోళన్, శివజ్యోతి, శ్రీ వెంకటేశ్వర సేవా సంఘాల సభ్యులు లెక్కింపులో పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.3 లక్షల విరాళం



ఈవోకి చెక్కులు అందజేస్తున్న దాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి ముగ్గురు స్నేహితులు విరాళాలు అందించారు. చినగంట్యాడకు చెందిన ఈసర్ల చిన అప్పలనాయుడు, కూర్మన్నపాలేనికి చెందిన సింహాద్రిబాబు, బెంగళూరుకి చెందిన కె.కృష్ణ శనివారం సింహగిరికి వచ్చి.. రూ.1,00,116 చొప్పున విరాళాల చెక్కులను దేవస్థానం ఈవో వి.త్రినాథరావుకు అందజేశారు. దేవస్థానం తరఫున దాతలకు స్వామి దర్శనం కల్పించి ప్రసాదం అందించారు. శేష వస్త్రాలు బహుకరించారు.

23న రవాణా శాఖ సీజ్ చేసిన వాహనాల వేలం

దాబాగార్డెన్స్: అనకాపల్లి ఆర్టీవో కార్యాలయ పరిధిలో రవాణా శాఖ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో సీజ్ చేసిన వాహనాలను వేలం వేస్తున్నట్లు అనకాపల్లి ప్రాంతీయ రవాణా శాఖా అధికారి జి.మనోహర్ ఓ ప్రకటనలో తెలిపారు. అపరాధ రుసుం, పన్ను బకాయిలు చెల్లించాలని వాహనాల యజమానులకు నోటీసులు జారీ చేసినా.. వారితో పాటు ఫైనాన్షియర్లు కూడా స్పందించలేదన్నారు. ఈ మేరకు ఈ నెల 23న మధ్యాహ్నం 3 గంటలకు అనకాపల్లి ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయం వద్ద ఐదు గూడ్స్ వాహనాలు, ఒక మ్యాక్సీ క్యాబ్ వాహనాన్ని బహిరంగ వేలం వేస్తున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల వారు నేరుగా కార్యాలయాన్ని సంప్రదించవచ్చు.

సాగరమిత్ర పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మహారాణిపేట: ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) కింద సాగర మిత్రలను తాత్కాలిక ప్రాతిపదికన నియమిస్తున్నట్లు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఫిషరీస్‌లో పాలిటెక్నిక్ డిప్లమో లేదా బీఎస్సీ ఫిషరీస్ సైన్స్/మెరైన్ బయాలజీ/జువాలజీ డిగ్రీ విద్యార్హత ఉన్న అభ్యర్థులు ఈ పోస్టులకు అర్హులు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 31లోగా మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు, ఫిషింగ్ హార్బర్, విశాఖపట్నం కార్యాలయంలో స్వయంగా లేదా రిజిస్టర్ పోస్ట్ ద్వారా సమర్పించాలి. 31వ తేదీ సాయంత్రం 5 గంటల తర్వాత వచ్చే దరఖాస్తులు పరిగణలోకి తీసుకోరు. మరింత సమాచారం కోసం ఫిషింగ్ హార్బర్‌లోని మత్స్యశాఖ కార్యాలయాన్ని సంప్రదించవచ్చు.

జలం ఫలం

తిరుమల నగర్‌కు జలశక్తి అవార్డు



ఆహ్లాదకరంగా కాలనీలోని పార్కు

ఆ కాలనీలో అడుగిడితే పక్షుల కిలకిలారావాలు స్వాగతిస్తాయి. చుట్టూ పరచుకున్న పచ్చదనం.. ఏ వీధి చూసినా ఎంతో శుభ్రత.. చిన్నాపెద్దలకు ఆటవిడుపుగా నందనవనాల్లాంటి ఉద్యానవనాలు మనసుకు ఆహ్లాదాన్ని అందిస్తాయి. నీటి పరిరక్షణ, ప్రకృతి హిత జీవనంపై సందేశాత్మక చిత్రాలు కాలనీవాసుల జీవన విధానాన్ని చెప్పకనే చెబుతాయి. ప్రతీ నీటిబొట్టును ఒడిసిపట్టి, నీటి కొరత అన్నది ఆ కాలనీ పరిసరాలను తాకకుండా చేసిన తీరు అద్భుతమనిపిస్తుంది. కాలనీని స్వచ్ఛతకు చిరునామాగా.. పర్యావరణ హితంగా తీర్చిదిద్దిన అసోసియేషన్ అకుంఠిత దీక్షకు పాలకులు, అధికారుల సహకారం కలసిరావడంతో జాతీయ స్థాయిలో గుర్తింపును తెచ్చుకుంది. ఆ కాలనీయే 87వ వార్డులోని తిరుమల నగర్. ఒకప్పుడు నీటి బొట్టు కోసం అల్లాడిన స్థాయి నుంచి నేడు మండువేసవిలోనూ పుష్కలంగా జలధార లభించే స్థితికి వచ్చింది. కేంద్ర జలశక్తి వనరుల శాఖ ఆధ్వర్యంలో ఏటా అందించే జలశక్తి అవార్డుకు కాలనీ ఎంపికైన సందర్భంగా తిరుమలనగర్ కాలనీ ప్రస్థానమిది..

> **సుందరవనంగా మలిచాం..**
>
> 
>
> నీటి చుక్కకు కటకటలాడే స్థితిలో మట్టి రోడ్లతో కళావిహీనంగా ఉన్న కాలనీని ఆదర్శ కాలనీగా రూపుదిద్దడంలో కాలనీవాసులందరి సహకారం ఎనలేనిది. అసోసియేషన్ చేపట్టే ప్రతీ కార్యక్రమంలో భాగస్వాములుగా నిలబడడంతో కేంద్ర స్థాయిలో గుర్తింపు తీసుకురాగలిగాం. కాలనీ ప్రజలతో పాటు ప్రజా ప్రతినిధులు, జీవీఎంసీ, జిల్లా అధికారులు కూడా మాకు వెన్నుదన్నుగా ఉండడంతో కాలనీని సుందరవనంగా మలచుకోగలిగాం.
>
> – జి.నాగభూషణం, అసోసియేషన్ అధ్యక్షుడు

- ఇంకుడుగుంతలతో ఇంటింటా జలనిధి
- ప్రతీ వీధిలో పరుచుకున్న పచ్చదనం
- ప్లాస్టిక్ నిషేధంతో పర్యావరణ హితం
- 22న రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు స్వీకరణ

SUNDAY SPECIAL

అగనంపూడి: రెండు దశాబ్దాల క్రితం తీవ్రమైన నీటి సమస్యతో, మట్టి రోడ్లతో పిచ్చిమొక్కలతో అస్తవ్యస్తంగా ఉండే తిరుమల నగర్ కాలనీ నేడు నందనవనంగా రూపుదిద్దుకుంది. కాలనీ వాసుల సమష్టి కృషితో ఆదర్శకాలనీల జాబితాలో చేరింది. ఎవరో వస్తారు, ఏదో చేస్తారని ఎదురుచూడకుండా కాలనీవాసులు అసోసియేషన్‌గా ఏర్పాటై ఒక్కో సమస్యను అధిగమించారు. సంఘటిత శక్తికి నిదర్శనంగా నిలిచిన తిరుమల నగర్ నేడు జీవీఎంసీ పరిధిలోనే కాకుండా జోనల్ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో, జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకునే స్థాయికి ఎదిగింది.

కాలనీ మారిందిలా..

ఆటోనగర్ పారిశ్రామికవాడను ఆనుకొని, 87వ



తిరుమలనగర్ కాలనీ

వార్డు కణితి నిర్వాసిత కాలనీకి సమీపంలో 12 వందల ప్లాట్లతో కాలనీ ఏర్పాటైంది. రోడ్డుకు ఇరువైపులా పచ్చని చెట్లు, వీలున్నచోట్ల ఇంకుడు గుంటలు ఏర్పాటు చేశారు. వర్షపు నీరు వృథాగా కాలువల్లోకి వెళ్లకుండా, ప్రతీ నీటి బొట్టును ఒడిసి పట్టుకొనేలా ఇంకుడు గుంతల్లోకి మళ్లించే ఏర్పాట్లు చేశారు. 170 ఇంకుడు గుంతలు పబ్లిక్ ప్రదేశాల్లో తవ్వించారు. వీటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ, మట్టిని తొలగిస్తుండడంతో కాలనీలో వేసవి కాలంలో కూడా నీటి ఎద్దడి అన్న మాటే వినపడదు. ఈ గుంతల ద్వారా 47 లక్షల క్యూబిక్ లీటర్ల నీటిని సంరక్షించే ఏర్పాటు చేశారు. అలాగే పార్కుల్లోనూ ఇంకుడు గుంతలు ఏర్పాటు చేశారు. దీంతో నీరు ఇంకిపోయి, భూగర్భజలాలు వృద్ధి చెందుతున్నాయి.

ఏ గోడ చూసినా సందేశాత్మక చిత్రాలే..



పబ్లిక్ ప్రదేశాలతో పాటు ఇంటి గోడలపై నీటి పొదుపు, స్వచ్ఛ భారత్, పచ్చదనం, పర్యావరణ ప్రాముఖ్యతలను తెలియజేసే అందమైన, ఆకర్షణీయమైన పెయింటింగ్‌లు వేయించారు. కాలనీలో ఏ గోడలు చూసినా అందమైన చిత్రాలు, ఆలోచింపజేసేలా నినాదాలతో నింపేశారు. ఎవరైనా రోడ్డుమీద చెత్త వేయాలన్నా.. మల,మూత్ర విసర్జన చేయాలన్నా తప్పు చేస్తున్నామనే భావన కలిగించేలా ప్రధాన కూడళ్లు, పార్కుల్లో సూక్తులు, మంచిమాటలు రాయించారు. ప్లాస్టిక్ కవర్లు, వస్తువుల వాడకాన్ని ఇక్కడ నిషేధించారు. ఎవరైనా దుకాణాలకు వెళ్తే క్లాత్ బ్యాగ్‌లు, స్టీల్‌బాక్సులతో వెళ్లి మార్కెట్ చేసుకోవడం అలవాటు చేశారు. ప్రతీ వారం స్వచ్ఛ భారత్ నిర్వహించడం, ప్లాస్టిక్ వాడకంపై నినాదాలు చేస్తూ ర్యాలీలు, సదస్సులతో అవగాహన కల్పించడం ఇక్కడ ఆనవాయితీగా మారిపోయింది. అందుకే కాలనీలో రోడ్లన్నీ ఎప్పుడూ పరిశుభ్రంగా దర్శనమిస్తాయి. సంఘటితంగా వీరు చేస్తున్న ఈ కృషికి పురస్కారాలెన్నో వరించి వస్తున్నాయి.



ఏటా పతకాల పంట

- 2009 నుంచి జీవీఎంసీ ప్రతీ ఏటా ఇచ్చే బెస్ట్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అవార్డును దక్కించుకుంటోంది. కరోనా వచ్చిన 2020 మినహా అన్ని సంవత్సరాలు నిరాటంకంగా అసోసియేషన్ అవార్డును అందుకుంటుంది.
- 2018లో రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ రెసిడెంట్స్ కాలనీగా అవార్డు అందించింది. అదే ఏడాది ఎన్‌సీఆర్‌డబ్ల్యూఏ బెస్ట్ ఆర్‌డబ్ల్యూఏ, మేనేజర్ అవార్డులను బహూకరించింది.
- 2019లో ఆనంద్ సిటిజన్, జీవీఎంసీ సంయుక్తంగా 25వేల నగదు అవార్డు అందించింది.
- 2021లో బెస్ట్ వాటర్ హీరో అవార్డు అసోసియేషన్‌తో పాటు కాలనీ అసోసియేషన్ ప్రతినిధి పరంధామయ్య కూడా అందుకున్నారు. అలాగే 2021, 22, 23ల్లో ఎన్‌సీఆర్‌డబ్ల్యూకే కాలనీకి అవార్డులు అందించడంతో పాటు మేనేజర్ అవార్డును పరంధామయ్యకు అందించారు.
- 2022లో నీటి గుంతల నిర్వహణ, నీటి సంరక్షణ చర్యలకు మెరిట్ అవార్డులను అసోసియేషన్‌కు అందించారు.
- 2023వ సంవత్సరానికి గాను కేంద్ర జల్‌శక్తి శాఖ ప్రకటించిన 5వ జాతీయ జల అవార్డుల్లో తిరుమల నగర్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ 3వ ర్యాంక్ దక్కించుకుంది.
- ఈ నెల 22న ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఈ అవార్డును అందుకోనున్నట్లు కాలనీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.నాగభూషణం, ఎం.పరంధామయ్య తెలిపారు.



జాతీయ అవార్డు అందుకుంటున్న అసోసియేషన్ ప్రతినిధులు(ఫైల్)



రోడ్డకిరువైపులా పచ్చదనం

> **సంఘటితంగా సాధించాం..**
>
> 
>
> 2004లో కాలనీలోకి అడుగు పెట్టాలంటే భయం భయంగా ఉండేది. ముళ్లపొదలు, గుబురుగా పెరిగిన పిచ్చిమొక్కల మధ్య నిర్మానుష్యంగా ఉండేది. ఇక మందుబాబుల సంగతి చెప్పక్కర్లేదు. కాలనీలో ఇళ్లు కట్టుకోడానికి భయపడే వాళ్లం. ఆ స్థితి నుంచి కాలనీ ఈ స్థాయికి వచ్చింది. ఇప్పుడు ఇక్కడ నివాసం ఉండటమంటే అందరికీ ఎంతో ఇష్టం, ఆనందం. కాలనీవాసులంతా సంఘటితంగా ఉండటం వల్లే ఈ ఘనత సాధించగలిగాం.
>
> –ఎం.పరంధామయ్య, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, వాటర్ హీరో అవార్డు గ్రహీత

నూతన పరిశ్రమల పాలసీలతో పురోగతి

ఏపీ సీఐఐ చైర్మన్ డాక్టర్ మురళీకృష్ణ



మాట్లాడుతున్న డాక్టర్ మురళీ కృష్ణ

బీచ్‌రోడ్డు: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పరిశ్రమల పాలసీతో పెద్ద సంఖ్యలో పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని, దీంతో రాష్ట్రం పురోగతి సాధిస్తుందని ఏపీ సీఐఐ చైర్మన్ డాక్టర్ మురళీ కృష్ణ అభిప్రాయపడ్డారు. నగరంలోని ఒక హోటల్‌లో శనివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరు పాలసీలను ప్రకటించగా.. అందులో రెండు పరిశ్రమల పురోగతికి సంబంధించినవని తెలిపారు. వీటిని సీఐఐ స్వాగతిస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నూతన పాలసీలను పటిష్టంగా అమలు చేస్తే.. ఏపీ దేశంలో టాప్-3లో ఉండటం ఖాయమన్నారు. ఈ పాలసీల ద్వారా ఉత్పత్తి రంగంలో రూ.30 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందన్నారు. పరిశ్రమల స్థాపన బట్టి ప్రోత్సాహకాలు కాకుండా.. ఎంత మందికి ఉపాధి కల్పిస్తున్నారనే దానిపై కూడా ప్రోత్సాహకాలు అందించడం ద్వారా మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో క్లస్టర్ హబ్‌ల ఏర్పాటు నిర్ణయం అభినందనీయమన్నారు. నవంబర్ 13న సీఐఐ, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా ఒక సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీఐఐ ప్రతినిధులు శివ కుమార్, సాంబశివరావు పాల్గొన్నారు.

గ్రంథాలయం మూత.. మంత్రి అసహనం

లోకేష్ పర్యటన సమాచారం లేకపోవడంతో స్థానిక నాయకుల అసంతృప్తి



గ్రంథాలయం మూసి ఉండటంతో డైరెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న మంత్రి లోకేష్

సీతమ్మధార: నెహ్రూబజార్ ప్రాంతీయ గ్రంథాలయాన్ని ఉదయం 9.45 గంటల వరకు తెరవకపోవడంతో రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ అసహనం వ్యక్తం చేశారు. గ్రంథాలయ శాఖ డైరెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి మందలించారు. విశాఖ పర్యటనలో భాగంగా ఆయన శనివారం జీవీఎంసీ 27వ వార్డులోని నెహ్రూ బజార్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి పిల్లలతో కాసేపు గడిపారు. ఏబీసీడీలు, రైమ్స్ వచ్చా అని పిల్లలను అడగ్గా.. వారు ఆడుతూ పాడుతూ సమాధానాలిచ్చారు. అనంతరం నెహ్రూ బజార్ ప్రాంతీయ గ్రంథాలయానికి చేరుకోగా మూసి ఉంది. ఉదయం 8 గంటలకు తెరవాల్సిన లైబ్రరీ.. 9.45 గంటలకు కూడా మూసి ఉండటంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రంథాలయ డైరెక్టర్‌కు ఫోన్ చేసి ఎందుకు సమయానికి లైబ్రరీలను తెరవడం లేదని ప్రశ్నించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ పబ్లిక్ లైబ్రరీల వ్యవస్థను బలోపేతం చేస్తామని.. వీటి పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియమిస్తామని తెలిపారు. అయితే ఈ పర్యటనలో స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, కార్పొరేటర్ గొలగాని వీరారావు కనిపించలేదు. మంత్రి పర్యటనపై వారికి ఎటువంటి సమాచారం లేదని తెలిసింది. రాష్ట్ర మంత్రి తమ వార్డులో పర్యటిస్తే.. తమకు కనీస సమాచారం ఇవ్వకపోవడం ఏమిటని కూటమి ప్రజా ప్రతినిధులు, నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.

భారీ వర్షాల హెచ్చరికలతో అప్రమత్తం

మహారాణిపేట: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల భారీ వర్షాలు కురుస్తాయనే హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ముందస్తుగా కలెక్టర్, తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసింది. శనివారం నుంచి ఈ నెల 24వ తేదీ వరకు ఈ కంట్రోల్ రూమ్‌లు పని చేస్తాయని, ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో ఈ నంబర్లను సంప్రదించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ సూచించారు. కలెక్టరేట్‌లో 0891-2590100, 0891-2590102 నంబర్లతో కంట్రోల్ రూమ్ పనిచేస్తుందని పేర్కొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం	ఫోన్ నంబర్లు
ఆనందపురం	72072 72074
భీమిలి	97038 88838
పద్మనాభం	91000 22988
పెందుర్తి	90591 94930
సీతమ్మధార	85006 33988
మహారాణిపేట	99851 79888
గోపాలపట్నం	98665 55426
గాజువాక	97054 44624
పెదగంట్యాడ	99486 09917
ములగాడ	91774 69350

విజ్ఞానం పంచే 'విద్యా పర్యాటకం'

శ్రీకారం చుట్టిన కలెక్టర్ హరేంధిర ప్రసాద్



ఎడ్యుకేషనల్ టూరిజం యాత్రకు బయలుదేరిన విద్యార్థులతో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, అధికారులు

మహారాణిపేట: పర్యాటక రంగాన్ని అన్ని వర్గాల వారికి చేరువ చేయాలనే ఉద్దేశంతో మూడు సెక్టార్లలో ఎడ్యుకేషనల్ టూరిజంను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. విద్యా పర్యాటకం ద్వారా విద్యార్థులకు చారిత్రక ప్రదేశాల విశేషాలు, విశిష్టతలు తెలుస్తాయన్నారు. ఎడ్యుకేషనల్ టూరిజంలో భాగంగా ప్రవేశ పెట్టిన నూతన విధానానికి కలెక్టర్ శనివారం శ్రీకారం చుట్టారు. గాయత్రీ విద్యాపరిషత్, అగనంపూడి ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలెక్టరేట్ నుంచి బయలుదేరిన విద్యా పర్యాటక ఐటెనెరరీ బస్సులను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎడ్యుకేషనల్ టూరిజంలో భాగంగా జిల్లాలోని వివిధ పర్యాటక కేంద్రాలను అనుసంధానం చేశామని.. వాటిల్లో ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివే వారికి ఉచితంగా, ప్రైవేట్ విద్యా సంస్థల వారికి కనీస రుసుం రూ.10తో ప్రవేశాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

మెరైన్ మ్యూజియం ఎడ్యుకేషనల్ టూర్‌లో భాగంగా సాగరతీరంలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించవచ్చని కలెక్టర్ తెలిపారు. సీ హారియర్ మ్యూజియం, టీయూ-142, ఐఎన్ఎస్ కురుసురా సబ్‌మెరైన్, మారిటైమ్ మ్యూజియంల విశేషాలను గైడ్ వివరిస్తారన్నారు. జీవ వైవిధ్య పర్యటనలో భాగంగా ఇందిరా గాంధీ జూ పార్కు, కాపులుప్పాడ సమీపంలోని బయో డైవర్సిటీ పార్కును సందర్శించవచ్చన్నారు. కంబాలకొండ అభయారణ్యంలో కొన్ని ట్రెక్కింగ్ అనుభవాలను కూడా విద్యార్థులు సొంతం చేసుకోవచ్చన్నారు. తీర పర్యావరణ టూర్‌లో భాగంగా ఏయూలోని జీవశాస్త్ర ప్రయోగశాలలను సందర్శించవచ్చని, మడ అడవుల పరిశోధన కేంద్రం, ఫిషరీస్ సర్వే ఆఫ్ ఇండియా మ్యూజియం చూసే అవకాశం కల్పిస్తామన్నారు. తీర ప్రాంత పరిశోధనలకు సంబంధించి మెరైన్ లైవ్ వాక్‌ను అనుసంధానం చేస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. ఈ అవకాశాన్ని జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా టూరిజం అధికారి జ్ఞానవేణి, డీఈవో చంద్రకళ, మారిటైం బోర్డు అధికారి సుబ్బిరెడ్డి, ఫారెస్ట్, మత్స్య శాఖల అధికారులు, టూరిజం కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

ఐఎన్‌ఏ అధ్యక్షుడిగా డాక్టర్ లక్ష్మీనరసింహాన్



ఇమాద్ ఎం.నజ్మ్‌ను సన్మానిస్తున్న డాక్టర్ గగన్‌దీప్ సింగ్

మహారాణిపేట: నగరంలోని ఒక హోటల్‌లో శనివారం జరిగిన ఇండియన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీ (ఐఎన్‌ఏ) వార్షిక సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 2025 సంవత్సరానికి ఐఎన్‌ఏ నూతన కార్యవర్గాన్ని ప్రకటించగా.. ఐఎన్‌ఏ జాతీయ అధ్యక్షుడిగా చెన్నైకి చెందిన డాక్టర్ ఆర్.లక్ష్మీనరసింహాన్ ఎన్నికయ్యారు. వచ్చే ఐఎన్‌ఏ వార్షిక సమావేశాలు వారణాసి (2025), జైపూర్ (2026)లో నిర్వహించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో భాగంగా అమెరికా నుంచి వచ్చిన డాక్టర్ హారతి బందారు తలనొప్పిలో పురోగమనాలు అనే అంశంపై ప్రసంగించారు. 1924లో హన్స్ బెర్గర్ ఈఈజీని కనుగొన్న నాటి నుంచి మూర్ఛ వ్యాధి ప్రస్తుత స్థితి, భవిష్యత్ అనే అంశంపై ఇమాద్ ఎం నజ్మ్ (యూఎస్‌ఏ), ఎన్.హెచ్ వాడియా తమ అభిప్రాయాలను పంచుకున్నారు. న్యూరోలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్ఐ) అధ్యక్ష ఉపన్యాసంలో భాగంగా దల్జిత్ సింగ్ మెదడు వ్యాధుల్లో ఎండోవాస్కులర్ ఎంబోలైజేషన్ పాత్ర గురించి వివరించారు. న్యూరో ఎపిడెమియాలజీ, ఎవిడెన్స్-బేస్డ్ న్యూరోసైన్స్‌లలో ఉత్తమ పరిశోధన పత్రానికి డాక్టర్ కామేశ్వర్ ప్రసాద్ అవార్డు, న్యూరో మస్క్యులర్ వ్యాధులపై ఉత్తమ పరిశోధన పత్రానికి డాక్టర్ ఎం. గౌరీ దేవి అవార్డులను ప్రదానం చేశారు. నిర్వాహక కమిటీ చైర్మన్ జి.బుచ్చిరాజు, కార్యదర్శి ఎస్.గోపి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రేపటి నుంచి పిల్లలకు ఉచిత గుండె శస్త్రచికిత్సలు

మహారాణిపేట: విశాఖలోని ఆంధ్రా హాస్పిటల్స్‌లో ఈ నెల 21 నుంచి 25 వరకు పిల్లలకు ఉచిత గుండె శస్త్రచికిత్సలు నిర్వహించనున్నారు. హీలింగ్ లిటిల్ హార్ట్స్ యూకే చారిటీ సంస్థ సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆంధ్రా హాస్పిటల్స్ డైరెక్టర్, చీఫ్ ఆఫ్ చిల్డ్రన్స్ సర్వీసెస్ డాక్టర్ పి.వి.రామారావు తెలిపారు. ఇంగ్లాండ్ నుంచి వస్తున్న కార్డియాక్ టీమ్‌తో కలిసి క్లిష్టమైన గుండె ఆపరేషన్లు చేయనున్నట్లు వెల్లడించారు. మరింత సమాచారం కోసం 88866 79733, 0891-2724777కు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు. విజయవాడలో ఇప్పటికే 4000 గుండె శస్త్రచికిత్సలు చేసినట్లు వెల్లడించారు.

మందుల షాపు తొలగించి.. మద్యం షాపు

అడ్డుకున్న భూపేష్‌నగర్ మహిళలు ● వేరే ప్రాంతానికి తరలించాలని డిమాండ్



చావులమదుం జంక్షన్ వద్ద ఏర్పాటు చేస్తున్న మద్యం దుకాణం ముందు బైఠాయించిన మహిళలు

అల్లిపురం: చావులమదుం జంక్షన్ వద్ద వైన్‌షాప్ ఏర్పాటు చేయవద్దని శనివారం భూపేష్‌నగర్ మహిళలు ఆందోళనకు దిగారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో రెండు మద్యం షాపులు ఉన్నాయని, మరో వైన్ షాపు ఏర్పాటు చేయవద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మద్యం షాపు ఏర్పాటు చేస్తున్న ప్రాంతానికి వచ్చి నిర్వాహకులను అడ్డుకున్నారు. ఈ ప్రాంతంలోని మెడికల్ షాపును తొలగించి.. మద్యం దుకాణం పెడుతున్నారని మండిపడ్డారు. భూపేష్‌నగర్ వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి అని.. ఇక్కడ మద్యం షాపు పెడితే మహిళలు, యువతులు, పిల్లలకు రక్షణ లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. జ్ఞానాపురంలో ఇప్పటికే మద్యం దుకాణాలు ఉన్నప్పటికీ.. ఇక్కడ మరో దుకాణం ఏర్పాటు చేయడం దారుణమన్నారు. ఇక్కడ వైన్ షాపును వేరే ప్రాంతానికి తరలించాలని డిమాండ్ చేస్తూ.. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.

రైల్వేను విచ్ఛిన్నం చేసేందుకు కేంద్రం కుట్ర

- కార్పొరేట్లకు రైల్వేను కట్టబెట్టేందుకే యోచన
- నేషనల్ కో ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న ఉమా మహేశ్వరరావు

డాబాగార్డెన్స్: భారతీయ రైల్వేని విచ్ఛిన్నం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని నేషనల్ కో–ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు ఉమామహేశ్వరరావు, రమేష్‌బాబు తెలిపారు. విశాఖలో శనివారం నేషనల్ కో ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇండియన్ రైల్వేలో భద్రతా చర్యలు పాటించడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయన్నారు. 2023–24లో 40 రైల్వే ప్రమాదాలు జరిగి 313 మంది ప్రయాణికులు, నలుగురు రైల్వే ఉద్యోగులు మరణించగా.. వేలాది మంది ప్రయాణికులు గాయాలపాలయ్యారని తెలిపారు. రైల్వేలో 3 లక్షలకు పైగా ఖాళీలున్నాయని, ప్రధానంగా సేఫ్టీ విభాగంలో పనిచేస్తున్న ఎక్కువగా ఖాళీలున్నాయని పేర్కొన్నారు. వందేభారత్ ట్రైన్లంటూ ప్రచారం తప్పా.. ప్రయాణికుల భద్రతపైనే, సౌకర్యాలపైన ఎటువంటి శ్రద్ధ లేదన్నారు. రైల్వేలోని విభాగాలను ముక్కలుగా చేసి దేశీ, స్వదేశీ కార్పొరేట్లకు రైల్వేని కట్టబెట్టే యోచనలో కేంద్రం ఉందని విమర్శించారు. మరో పక్క ప్రజలకు అందుబాటులో ఉన్న సాధారణ బోగీలు తగ్గించి రిజర్వేషన్ల పేరిట ఆదాయాలు పెంచుకునే మార్గాలను అన్వేషిస్తున్నారన్నారు. వయో వృద్ధులు, ఇతరులకు ఇచ్చే రాయితీలపై కోతలు పెడుతున్నారని, నేషనల్ మోనిటైజేషన్ పైప్‌లైన్ పేరిట రైల్వే స్టేషన్లు ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పి యూజర్ చార్జీలు పేరిట ప్రయాణికులపై విపరీతమైన భారాలు మోపుతున్నారన్నారు. రైల్వేలో దేశ వ్యాప్తంగా సుమారు 5 లక్షల మంది కాంట్రాక్టు కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారన్నారు. టెక్నాలజీపై ఉద్యోగులకు సరైన శిక్షణ ఇవ్వడం లేదన్నారు. డిసెంబర్ 20న ఢిల్లీలో రైల్వే రక్షణ, ప్రజల భద్రత, పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై కన్వెన్షన్ నిర్వహిస్తున్నామని, ఈ సదస్సులో కార్యాచరణ రూపొందిస్తామన్నారు. జాతీయ కోశాధికారి ఎం సాయిబాబు, వీవీఎల్ నరసింహులు, బి మధు, శ్రీహరి ఆచార్య, హైజాక్ ఖలీల్, సిటూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, బి.జగర్, ఒ.అప్పారావు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల దినోత్సవానికి ఏర్పాట్లు



ఏయూక్యాంపస్: పోలీస్ అమరవీరుల దినోత్సవం నిర్వహించేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం సిద్ధమవుతోంది. ఈ మేరకు బీచ్‌రోడ్డులోని పోలీస్ మెస్ ఎదురుగా ఉన్న పోలీసు అమరవీరుల స్థూపాన్ని శుభ్రం చేసి.. రంగులు వేశారు. బీచ్‌రోడ్డులో పోలీసులు ముమ్మరంగా రిహార్సల్ చేస్తున్నారు. పెద్ద సంఖ్యలో పోలీసులు తుపాకులు చేతపట్టుకొని.. అమరవీరులకు గౌరవ వందనం అందించే ఘట్టం అటుగా వెళ్లే సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది.

కొత్త సీసా.. పాత మందు..!

నూతన మద్యం పాలసీ పేరుతో కూటమి దగా





- ఇప్పటికీ అందుబాటులోకి రాని రూ.99 చీప్ లిక్కర్
- జిల్లాలో 155 మద్యం దుకాణాల్లో ప్రస్తుతానికి 116 మాత్రమే ఏర్పాటు
- షాపులు దొరక్కా ఇబ్బందులు పడుతున్న వ్యాపారులు
- పైసా కూడా తగ్గించకపోగా.. ఎమ్మార్పీ కంటే అధికంగా అమ్మకాలు

విశాఖ సిటీ: సీసా మాత్రమే మారింది. అందులో పాత లిక్కరే ఉంది. రూ.99కే క్వార్టర్ చీప్ లిక్కర్ అని ఊదరగొట్టారు. ఆ మాయ మాటలు విని మందుబాబులు ఎగిరి గంతేశారు. ఇప్పుడు మద్యం ధరలు తగ్గకపోగా.. ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మద్యం పాలసీ మందుబాబుల జేబులకు చిల్లులు పెడుతోంది. చవకగా బ్రాండెడ్ మద్యం వచ్చేస్తుందన్న ఆశలపై కూటమి ప్రభుత్వం నీళ్లు చల్లింది. మద్యంపై పైసా కూడా తగ్గించకపోగా.. కొత్త బాటిళ్లలో పాత మద్యాన్నే అందిస్తోంది. కేవలం 'ప్రైవేటు'కు మేలు చేయడానికే కొత్త మద్యం పాలసీ ప్రవేశపెట్టినట్లు స్పష్టంగా తెలుస్తోంది.

షాపుల కోసం వెతుకులాట

లాటరీలో మద్యం దుకాణాన్ని దక్కించుకోవడం కంటే.. దుకాణం ఏర్పాటుకు షాపు దొరకడమే కష్టంగా మారింది. సిండికేట్లు మాత్రం లాటరీకి ముందే కొంత మంది ఎక్సైజ్ అధికారుల సహకారంతో ప్రభుత్వ మద్యం దుకాణాలు నిర్వహించే షాపులను లీజులకు తీసుకున్నారు. మిగిలిన వారు మాత్రం మద్యం దుకాణం వచ్చి వారం రోజులైనా ఇంకా షాపుల వెతుకులాటలోనే ఉన్నారు. జిల్లాలో 155 షాపులకు గాను ప్రస్తుతం 116 మాత్రమే ఏర్పాటయ్యాయి. మిగిలిన 39 మంది షాపుల కోసం ప్రయత్నిస్తున్నారు. కొన్ని చోట్ల షాపులను లీజుకు మాట్లాడుకున్నప్పటికీ.. కూటమి నేతల షాపులకు సమీపంలో ఉన్నాయన్న కారణంతో షాపు యజమానులపై ఒత్తిడి చేస్తున్నారు. తమ అనుచరులనే స్థానిక ప్రజలుగా పంపించి నిరసనలు చేయించి.. షాపులు దొరక్కుండా చేస్తున్న సందర్భాలు ఉన్నాయి. కైలాసపురం ప్రాంతంలో ఒక టీడీపీ నేతకు సంబంధించిన బార్‌కు కొంత దూరంగా వైన్‌షాపు కోసం ఏర్పాట్లు చేస్తుండగా.. శనివారం దాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నించారు. ఇలా అనేక చోట్ల టీడీపీ నేతలకు సంబంధించిన వైన్‌షాపులు, బార్లు ఉన్న ప్రాంతాల్లో కొత్త వారు షాపులు ఏర్పాటు చేయకుండా అడ్డుతగులుతున్నారు.

సిండికేట్ల కోసమే..

సిండికేట్లను పెంచి పోషించడానికే కూటమి ప్రభుత్వం కొత్త మద్యం పాలసీని తీసుకువచ్చినట్లు ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో 133 మద్యం షాపులు ఉంటే.. కూటమి ప్రభుత్వం ఆ సంఖ్యను 155కు పెంచింది. వీటికి ఈ నెల 2వ తేదీ నుంచి దరఖాస్తులు ఆహ్వానించగా.. 4,139 మంది పోటీపడ్డారు. ఇందులో 80 శాతం దరఖాస్తులు సిండికేట్ల నుంచే రావడం విశేషం. ఒక్కో దుకాణానికి 5 నుంచి 15 దరఖాస్తులు సమర్పించారు. దీంతో 100 వరకు వైన్‌షాపులు ఈ సిండికేట్ల చేతుల్లో ఉన్నాయి. అలాగే కూటమి ప్రజాప్రతినిధుల అనుచరులు మరో 30 షాపుల వరకు చేజిక్కించుకున్నారు. ఈ నెల 14వ తేదీనే లాటరీ ప్రక్రియ ముగియగా.. ఆ మరుసటి రోజే 155 మంది లైసెన్సు ఫీజు చెల్లించినప్పటికీ.. ఇప్పటికీ జిల్లాలో పూర్తి స్థాయిలో వైన్‌షాపులు ఏర్పాటు కాలేదు.

రూ.99 లిక్కర్ ఊసేలేదు..

అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.99కి క్వార్టర్ చీప్ లిక్కర్ అందిస్తామని చంద్రబాబు ఊదరగొట్టారు. ఎన్నికల ప్రచారాల్లో రాష్ట్రాభివృద్ధికి, విశాఖ ప్రగతికి, ప్రజా సంక్షేమం కోసం కంటే.. లిక్కర్‌నే ప్రధాన ప్రచారాస్త్రంగా చెప్పుకుంటూ వచ్చారు. దీంతో మందుబాబులు కూడా తక్కువ ధరకే క్వార్టర్ మద్యం వస్తుందని ఆశపడ్డారు. కానీ కొత్త మద్యం పాలసీ వచ్చేసింది. కొత్త వైన్‌షాపులు ఏర్పాటవుతున్నాయి. కానీ ఇప్పటి వరకు రూ.99 చీప్ లిక్కర్ ఊసెత్తడం లేదు. చాలా మంది మందుబాబులు ఈ లిక్కర్ కోసం వైన్‌షాపుల చుట్టూ ప్రతి రోజూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. కానీ ఆ క్వార్టర్ మద్యం వస్తుందో? రాదో? తెలియదని వ్యాపారులు సమాధానమిస్తున్నారు. ఇదిలా ఉంటే ఎక్సైజ్ అధికారులకు కూడా ఈ రూ.99 చీప్ లిక్కర్‌పై ఎటువంటి సమాచారం లేకపోవడం గమనార్హం.

కొత్త వైన్‌షాపుల్లో పాత మద్యమే..

గత ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన మద్యం దుకాణాల్లో విక్రయించిన మద్యంపై కూటమి నేతలు తీవ్ర ఆరోపణలు చేశారు. నాణ్యతలేని మద్యం తాగి ప్రజల ఆరోగ్యాలు క్షీణిస్తున్నాయని కూటమి నాయకులు విస్తృత ప్రచారం చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ మద్యాన్ని నిలిపివేసి బ్రాండెడ్ మద్యం తీసుకువస్తామని హామీలు గుప్పించారు. జూన్ 12వ తేదీన కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. ఇప్పటికీ పాత మద్యాన్నే విక్రయిస్తూ వచ్చింది. ఎన్నికలకు ముందు వరకు నాణ్యత లేని మద్యం తాగి ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని ఆరోపణలు చేసిన కూటమి నేతలు.. ఇప్పటికీ అదే మద్యం విక్రయించడం గమనార్హం. కొత్త మద్యం దుకాణాలు ఏర్పాటైన తరువాతైనా బ్రాండెడ్ మద్యం వస్తుందనుకుంటే.. ఇప్పుడు కూడా కొత్త బాటిళ్లలో పాత మద్యాన్నే విక్రయిస్తున్నారు. బ్రాండెడ్ మద్యం తక్కువ ధరకు వస్తుందనుకుంటే.. పాత మద్యాన్నే ఎమ్మార్పీ కంటే క్వార్టర్‌కు రూ.20 అదనంగా విక్రయిస్తుండడం పట్ల మందుబాబులు మండిపడుతున్నారు. దీనిపై ఎక్సైజ్ అధికారులకు సైతం ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ సీఐలకు ఆదేశాలు అందాయి. అయితే ఇప్పటి వరకు ఒక్కరిపై కూడా కేసు నమోదు కాకపోవడం గమనార్హం.

క్రీడా జోష్

ఉత్సాహంగా కరాటే పోటీలు



కరాటేలో తలపడుతున్న విద్యార్థినులు

విశాఖ విద్య: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి క్రీడా పోటీలు ఉత్సాహభరితంగా సాగుతున్నాయి. గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలోని ఇండోర్ స్టేడియంలో శనివారం కరాటే పోటీలు జరిగాయి. అండర్–14, అండర్–17 బాల బాలికల పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలోని స్కూళ్ల నుంచి క్రీడాకారులు తరలివచ్చారు. 400 మంది వరకు పోటీల్లో పాల్గొనడంతో ఇండోర్ స్టేడియం ప్రాంగణంలో పండగ వాతావరణం కనిపించింది. క్రీడాకారులు, వారితో వచ్చిన సహాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులతో ఆ ప్రాంగణం సందడిగా మారింది. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ గోపాలపట్నం హైస్కూల్‌లో భోజనం అందించారు. బాల, బాలికలు కరాటేలో తమ ప్రావీణ్యాన్ని ప్రదర్శించగా.. విద్యార్థులు ఎంతో ఆసక్తిగా తిలకించారు. తమ పిల్లల కరాటే విన్యాసాలను తల్లిదండ్రులు సెల్‌ఫోన్లలో బంధించారు. వివిధ కరాటే అసోసియేషన్‌లకు చెందిన కోచ్‌లు రిఫరీలుగా వ్యవహరించారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని ఎస్జీఎఫ్ కార్యదర్శి దేముడుబాబు తెలిపారు.

మెరుగైన వైద్యసేవలందించాలి

సీతంపేట/మహారాణిపేట: ఆసుపత్రుల్లో వైద్య సేవలు మరింత విస్తృతం చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ వైద్యాధికారులను ఆదేశించారు. శనివారం ఆయన రామాటాకీస్ రోడ్‌లో గల ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలను, పెదవాల్తేర్‌లోని ఈఎన్‌టీ ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఆసుపత్రుల్లో అన్ని విభాగాలను పరిశీలించి అక్కడ అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. వార్డుల్లో పర్యటించి రోగులతో మాట్లాడారు. అనంతరం యూనియన్ బ్యాంకు (ఎల్‌బి కళాశాల బ్రాంచి) వైద్యశాలకు ఉచితంగా అందజేసిన 50 మొక్కలు నాటే కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు, ప్రాంతీయ నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ మీనాక్షి, ఈఎన్‌టీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మురళీకృష్ణ, ఆర్‌ఎంవో నవీన్‌కుమార్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

కూటమి నేతల ఒంటెద్దు పోకడ

- ముందస్తు అనుమతి లేకుండా అధ్యయన యాత్ర
- కాంట్రాక్టర్‌కు బిల్లు రావడం కష్టమే.?



డాబాగార్డెన్స్: అధికారం చేతుల్లో ఉంది కదా అని కూటమి ప్రజాప్రతినిధులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. జీవీఎంసీ కౌన్సిల్ ఆమోదం లేకుండానే నిర్ణయాలు తీసేసుకుంటున్నారు. మేయర్ ముందస్తు అనుమతులు ఇవ్వకపోయినా డీల్స్ కుదుర్చుకుంటున్నారు. ఇందుకు అధికారులు కూడా కూటమి నేతలకు వంత పాడుతున్నారు. జీవీఎంసీ పరిధిలో ఏదైనా టెండర్లు, పనులకు సంబంధించి స్థాయి సంఘం, కౌన్సిల్‌లో నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక.. స్థాయీ సంఘం నూతన సభ్యులు ఎన్నికైన తర్వాత.. జీవీఎంసీలో నియమ నిబంధనలను గాలికొదిలేశారు.

అప్పుడో మాట.. ఇప్పుడో మాట

అధ్యయన యాత్ర పేరిట జీవీఎంసీ కార్పొరేటర్లు ఆదివారం యాత్రకు బయలుదేరనున్నారు. 8 రోజుల పాటు బెంగళూరు, మైసూరు, బందీపూర్, ఊటీ, పనాజీ తదితర ప్రాంతాలు సందర్శించనున్నారు. అక్కడ స్టార్ హోటల్లో బస, లగ్జరీ బస్సుల్లో విహారయాత్ర చేయనున్నారు. అయితే ఈ టూర్ విషయంలో నిబంధనలను అతిక్రమించారు. వాస్తవానికి మేయర్ నుంచి ముందస్తు అనుమతులు పొందాలి. ఆ తర్వాత టెండర్ ఖరారు చేసుకోవాలి. కానీ ఇక్కడ అలా జరగలేదు. ముందుగానే టెండర్ ఖరారు చేసి.. ఉన్నతాధికారి ప్రోద్బలంతో శనివారం అంటే ఈ యాత్రకు ఒక్క రోజు ముందు ముందస్తు అనుమతికి మేయర్‌కు ఫైల్ పంపారు. ఇది కూటమి నేతల ఒంటెద్దు పోకడలకు నిదర్శనం. కాగా.. ఎటువంటి ముందస్తు అనుమతి పొందకుండా కాంట్రాక్టర్ అధ్యయన యాత్రకు సంబంధించి కాంట్రాక్ట్ పొందాడు. నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్టర్ ఈ డీల్‌ను ఎలా కుదుర్చుకున్నాడో తెలియదంటూ పలువురు కార్పొరేటర్లు అంటున్నారు. కాంట్రాక్టర్‌కు బిల్లు పాసవ్వడం కష్టమేనని హెచ్చరిస్తున్నారు. ఇటీవల కూటమి నేతలు ఎటువంటి ముందస్తు అనుమతులు ఇవ్వొద్దంటూ కౌన్సిల్ సమావేశంలో గగ్గోలు పెట్టారు. తాజాగా ఆ కూటమి నేతలే ఉన్నతాధికారి ద్వారా అధ్యయన యాత్రకు సంబంధించి ముందస్తు అనుమతుల కోసం మేయర్ ఫైల్‌కు పంపడం గమనార్హం.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.